ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి




కుమరం భీం

జిల్లా వార్తలు

8

సోమవారం 12 మే 2025



- పక్కా రికార్డుల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు
- గ్రామానికో రెవెన్యూ ఖాతా ఏర్పాటుకు సన్నాహం
- సత్వర సమాచారం తెలిసేలా ప్రణాళిక
- మండలాల వారీగా అధికారుల అవగాహన సదస్సులు

కాగజ్‌నగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు తీరుతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సైట్‌ను రద్దు చేసి నూతనంగా భూ భారతి రెవెన్యూ చట్టం-2025 ఏప్రిల్ 14న రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. భూ సమస్యలను పక్కాగా లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ శాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ ఖాతాలు మండలాల వారిగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గతంలో 32 కాలంలతో పహాణి ఉండేది. 2020 సంవత్సరంలో ఈ ప్రక్రియను రద్దు చేసింది. భూములకు సంబంధించిన పూర్తి వివరాలు పహాణిలో స్పష్టంగా ఉండేవి. ధరణి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పూర్తిగా వివరాలను తొలగించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అనేక ఇబ్బం దులకు గురైన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టం అమలులోకి తెచ్చింది.

● కొత్త చట్టంలో..

భూ భారతి రెవెన్యూ-2025లో పాత పద్ధతిని కొన సాగించేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించారు. దీంతో అధికారులు ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిని ఉన్న వ్యవసాయ భూమలు, వ్యవసాయే తర భూము లతో రెవెన్యూ ఖాతాలను పొందుప రిచేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేయాలని భావిస్తుండడంతో గతంలో ఇబ్బందులు పడ్డ రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. భూ భారతి చట్టం అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అధికార యంత్రాంగం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆయా మండలాల్లో వీటిపైనే తొలి దృష్టి సారిస్తున్నారు. ధరణిలో ఉన్న లోపాలను సవరిస్తూ వచ్చిన భూ భారతి చట్టంపైనే అంతా ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో నిర్వహించారు. కీలక సమస్యలను ప్రాథమికంగా ఎంపిక చేసుకున్నారు. గతంలో ఉన్న లోపాలను, ప్రస్తుతం వచ్చిన చట్టంలో అంశాలపై అర్జీలను స్వీకరిస్తున్నారు. ఒక్క కాగజ్‌న గర్ మండలంలోని రేగులగూడ గ్రామానికి సంబంధిం చిన సమస్యలను జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు గత పక్షం రోజుల క్రితం వివరించారు. ఈ గ్రామంలో ఉన్న రైతులందరి భూములకు ధరణి రాక ముందు పట్టాలున్నాయి. ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత వీటికి ప్రభుత్వ భూమి అని పేరు రావడంతో ఎనిమి దేళ్లగా తిరుగుతున్నామని, తమ గ్రామానికి సంబం ధించిన రెవెన్యూ ఖాతా వివరాలు కూడా తీసేశారని కలెక్టర్‌కు రైతులు మొర పెట్టుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు భూభారతి చట్టం వచ్చిందని పక్కాగా లెక్కలు తీస్తున్నామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. భూ భారతి చట్టం అమల్లోకి వస్తుం డడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ ఖాతాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో న మోదు చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుం టోంది. తప్పులను సవరిస్తూ పక్కాగా లెక్కలు తీసే పనిలో నిమగ్నమైంది. ఈ చట్టంతో ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు పూర్తి స్థాయి న్యాయం చేకూర్చాలని భావిస్తోంది. అధికారులు దీన్ని పకడ్బందీగా అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

● పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తూ..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తూ పక్కాగా సమాచారం సేకరిస్తూ ముందు కెళుతోంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 335 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ ఖాతాలను ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. గతంలో భూముల వివరాలు తెలియక పడుతున్న ఇబ్బందులు ప్రస్తుతం చట్టం వలన తహసీల్దార్‌లకు సులువుగా మారనుం దని చెబుతున్నారు. తిరిగి ఈ బాధ్యతలను వీఆర్వో వీఆర్ఏలకు అప్పగిస్తే ఆయా రికార్డులపై పట్టున్నం దున నిర్వహణ చేపట్టడంలో ఇబ్బందులు తప్పుతాయి. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో సాగు భూమి, బీడుభూములు, వ్యవసాయేతర భూముల వివరాలు తెలిసేవి కావు. భూ సర్వే నంబరు, యా జమాని పేరుతోనే ఆన్‌లైన్‌లో కన్పించేలా భూభారతి లో మార్పుచేర్పులు చేసింది. ప్రస్తుతం భూమిలో ఎవరు ఉన్నారు..? పట్టేదారు ఉన్నాడా..? అనుభవదా రుడు ఉన్నాడా..? అనే అంశాలను ధరణిలో పొందుపర్చలేదు. గతంలో పని చేసిన వీఆర్‌వోలు, వీఆర్ఏలు భూ సమస్యలపై పట్టు ఉండేది. భూ దస్త్రాలపై అవగాహన వీరికి ఉండడంతో 32 కాలంల పహాణి అన్ని రకాల వివరాలు ఉండేవి. దీంతో రెవిన్యూ ఖాతాలు స్పష్టంగా నిర్వహణ చేసే వారు. వ్యవసాయ భూములు ఎన్ని ఉన్నాయి..? వ్యవసా యేతర భూములు ఎన్ని..? సాగు లేని భూములు ఎన్ని ఉన్నాయనే విషయాలు రెవిన్యూ ఖాతా నమో దు చేసేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించేందుకు అవకాశాలుం డేవి. ఏటా మార్చిలో వీటిని ప్రక్షాళన చేస్తూ తాజా పరిస్థితులను బట్టి నమోదు చేసేందుకు వీలుండేది. ఈ లెక్కలతోనే రెవెన్యూ శాఖ ఏటా జమాబందీ నిర్వహించి పన్నులు విధించే వారు. ధరణిలో నుంచి ఈ అంశాలను పూర్తి గా అప్పటి ప్రభుత్వం తొలగించింది. దీంతో జమా బందీ లెక్కలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అటవీప్రాంతంలో చుక్కల దుప్పిని వదిలిపెడుతున్న సిబ్బంది

సిర్పూర్(టి), మే 11 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఆదివారం రేసు కుక్కల దాడిలో తప్పించుకుని చుక్కల దుప్పి చీలపల్లి గ్రామంలోని ఓ ఇంట్లోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బంది దుప్పిని సురక్షితంగా కాపాడి ఉన్నతాధికారుల సూచన మేరకు అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని తలపెట్టినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్లు సంతోష్, అరవింద్, అరుణ్‌రెడ్డి, వాచర్లు ఇర్ఫాన్, శ్యాంరావు, సంజు, గణపతి, రవి తదితరులు ఉన్నారు.

బుద్ధ జయంతిని విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి), మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో గల బుద్ధ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించే బుద్ధ జయంతిని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. నాగమ్మ చెరువులోని బుద్ధ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధ జయంతి వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో నాయకులు కీజర్‌హుస్సేన్, మహేష్, ఇప్పతుస్సేన్, శివరాం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చరణ్, ప్రశాంత్, దాదాజీ, మారుతి, మల్లయ్య, సురేందర్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హద్దు రాళ్ల తొలగింపు

రెబ్బెన, మే 11 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కొండపల్లి గ్రామ ఎక్స్‌రోడ్డు దగ్గర అక్రమంగా లేఅవుట్‌లో వేసిన హద్దు రాళ్ల ఆదివారం పంచాయతీ అధికారులు తొలగించారు. డీటీసీపీ, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయొద్దని అధికారులు సూచించారు. ఇలాంటి ప్లాట్స్ కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణానికి అనుమతి రాదని చెప్పారు. బ్యాంకు రుణాలు కూడా ఇవ్వరని పంచాయతీ కార్యదర్శి నమ్రత, మండల పంచాయతీ అధికారి వాసుదేవ్ అన్నారు. డీటీసీపీ అప్రూవల్ చేసిన ప్లాట్లను కొనుగోలు చేయాలని వారు సూచించారు.

తునికాకు సేకరణ ప్రారంభం



ఆరబెడుతున్న తునికాకు

సిర్పూర్(టి), మే 11 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చీలపల్లి, పూసుగూడ, మాలిని యూనిట్లలో ఆదివారం తునికాకు సేకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రైతులు తునికాకును సేకరించి కల్లాలకు తీసుకు వచ్చారు. వేసవి పంటగా భావించే తునికాకు సేకరణకు ఉదయమే కూలీలు అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇంటిల్లిపాది కట్టలు కట్టి కల్లాలకు తరలించి ఆదాయం పొందుతారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

సిర్పూర్(టి), మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు దశల వారిగా కేటాయిస్తుందని మాజీ ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మొదటి విడతలో మండలానికి 250 మంజూరు చేసిందని చెప్పారు. రెండు మూడో విడతలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. మొదటి జాబితాలో రాని వారు నిరాశ పడోద్దని చెప్పారు. అందరికి వస్తాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అధికారులు పకడ్బందీగా జాబితా తయారు చేశారన్నారు. చింతలమానేపల్లి డబ్బా గ్రామంలో ఇన్‌చార్జి మంత్రి సీతక్క భీం విగ్రహం ఆవిష్కరణకు సోమవారం వస్తున్న సందర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొని మంత్రి కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోహెల్ అహ్మద్, తులసీరాం, రాజు, అఖిల్, ఎంఎ సలీం, మోహిజ్ అలీ, కిశోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక అన్నీ ప్రధాన కేంద్రాలే..

- మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్
- జిల్లాలో పెరగనున్న సిబ్బంది



గోలేటిలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం

రెబ్బెన, మే 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు నాణ్యమైన పూర్వప్రాథమిక విద్యనందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మిని అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసింది. ఇక నుంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారనున్నాయి. ఈ కేంద్రాల్లో పని చేస్తున్న వేతనాలు కూడా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మేజర్ అంగన్వాడీ కేంద్రాలుగా గుర్తించాలని గత కొన్ని సంవత్సరాలుగా అంగన్వాడీలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో మిని అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మిని కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు రూ.7,500 వేతనం చెల్లింస్తుండగా ఇక నుంచి వీరికి రూ.13,650 చొప్పున జీతం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూరు(టి), జైనూరు, వాంకిడి మొత్తం ఐదు ఐసీడీఎస్ కేంద్రాలుండగా, ఇందులో 139 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో కేవలం టీచర్లు మాత్రమే అన్నీ పనులు చూసుకునే వారు. పూర్వ ప్రాథమిక విద్యను అందించటంతో పాటు పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు వంట చేసి పెట్టడం, రోజు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయటం, పౌష్టికాహారంపై అవగాహణ కార్యక్రమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించేవారు. కొన్ని సంవత్సరాలుగా మిని కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరి పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మిని అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. మేజర్ అంగన్వాడీలుగా మారటంతో ఆయాల పోస్టులు సైతం పెరుగనున్నాయి. ప్రస్తుతం 126 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 397 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నీ కేంద్రాలు కూడా ఒకే కేటగిరిలో గుర్తించటంతో అందరికి రూ.13,650 చొప్పున వేతనాలు అందుకోనున్నారు. జిల్లాలోని అనేక కేంద్రాలు అద్దె, రెంట్ ఫ్రీ(స్కూల్ బిల్డింగ్స్) కొనసాగుతున్నాయి. కొత్త భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని అధికారులు పేర్కొంఉన్నారు. 352 కేంద్రాలకు సొంత భవనాలుండగా, 326 కేంద్రాలు పాత స్కూల్ భవనాల్లో నిర్వహిస్తున్నారు. 296 కేంద్రాలకు ఎలాంటి భవనాలు అందుబాటులో లేక పోవటంతో అద్దెభవనాల్లోనే కొనసాగిస్తున్నారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా కేంద్రప్రభుత్వం జిల్లాలోని పీవీటీజీ గ్రామాల్లో 38 అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేసినట్టు అధికారులు వెల్లడించారు. సంబంధిత గ్రామాల్లో భవనాల నిర్మాణం చేపట్టేందుకు స్థలాలను గుర్తించాల్సి ఉంది. తదనతరం ప్రత్యేక నిధులను కేటాయించి టీచర్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో పారదర్శకతతో పాటు అవినీతికి తావులేకుండా ప్రతి టీచర్‌కు రూ.20వేల చేసే ట్యాబ్ కూడా అందజేయనున్నట్టు తెలిసింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిర్పూర్(టి), మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల లో 2001-02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. సుమారు 25 ఏళ్ల అనం తరం కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం అప్పుడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆసిఫాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని బుర్గుడ పరిధిలోని బీఈడి కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్లా బిన్ సాల్‌హే (అబ్బు, 42) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లా బిన్ సాల్‌హే పని నిమిత్తం కారులో కాగజ్‌నగర్ వెళ్తున్నాడు. బుర్గుడ బీఈడి కళాశాల సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో అతడి కాళ్లకు తీవ్రగా యాలయ్యాయి. స్థానికులు 108లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబలి పంపిణీ

బెజ్జూరు, మే 11(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన వార సంతలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు స్థానికులు అంబలి తాగారు. వేసవిలో ప్రజల కోసం అంబలి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దేవుడి ఉత్సవాలు ప్రారంభం



ఊరేగింపు నిర్వహిస్తున్న ఆత్రం వంశీయులు

సిర్పూర్(యు), మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రెసిడెంట్‌గూడలో సిర్పూర్‌కార్ ఆత్రం వంశీయుల పెద్ద దేవుడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెర్సపెన్‌ను(పెద్ద దేవుడిని) ఆదివారం మండల కేంద్రంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆదివాసీలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆత్రం వంశీయుల కొత్త కోడ్లలు(బేటింగ్) పరిచయం కార్యక్రమం నిర్వహించారు. ఈ పెర్సాపెన్ ఉత్సవాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి సిర్పూర్‌కార్ ఆత్రం వంశీయులు, ఆదివాసీలు హాజరయ్యారు. సోమవారం పెద్ద దేవుడికి గంగా జలాభిషేకం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్రం వంశీయుల గురువు ఆత్రం లింబారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఆత్రం భీంరావు, శ్రీరావ్, ఆత్రం బల్వంత్‌రావు, ఆత్రం నేహ్రూ, ఆత్రం ఆనంద్‌రావు, దుర్వా మోతిరాం పాల్గొన్నారు.

సేంద్రియ సాగు వైపు.. రైతుల చూపు

» ట్రాక్టర్ల సాయంతో పొలాలకు తరలింపు » అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పంట చేనులో వేసిన సేంద్రియ ఎరువు



సేంద్రియ ఎరువును పంట చేనులో ట్రాక్టర్‌తో పోయిస్తున్న రైతు

కెరమెరి, మే 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయరంగంలో రసాయనిక ఎరువుల వాడడం వల్ల భూమిలోని భూసారం దెబ్బతిని తెగుళ్ల సోకి దిగుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. అందుకు గాను ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు వాడకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో రైతులు తమ పంట చేనులో ఇతర ప్రాంతాల నుంచి మండలానికి పశువులను తీసుకని మేత కోసం వచ్చే పశువుల పెంపకందారులతో మాట్లాడి తమ పంట చేనులో మేకలు, గొర్రెల మందులు ఉండేలా చూస్తున్నారు. అలాగే మరికొందరు రైతులు ఈ ప్రాతంలోని పవువుల పెంపకందారుల వద్ద ఎరువు కొనుగోలు చేస్తూ తమ పంట చేనులలో చల్లుతున్నారు.

చెరువు మట్టి..

రైతులు తమ పంట చేనులలో ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల మట్టిని సైతం ట్రాక్టర్‌తో తమ తమ చేఉలకు తరలిస్తున్నారు. నల్ల రేగడి మట్టి, పత్తి కంది పంటలకు అనుకూలంగా ఉండడం వల్ల మండల కేంద్రంతో పాటు సాంగ్వీ, కేలి(కె), కేలి(బి), గోయగాం, సావర్‌ఖేడ, ఇందాపూర్, దనోర, పార్ద, మురికి లొంకతో పాటు పలు చేనుల్లో వేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా 8234 మంది రైతులు 24 వేల ఎకరాల్లో పత్తి కంది, పెసర, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. నల్లరేగడి మట్టి, పవువుల ఎరు వులు ఆయా గ్రామాల్లో నుంచి రైతు చేనులోకి ట్రాక్టర్ ద్వారా తరలిం చేందుకు దూరాన్ని బట్టి వెయ్యి నుంచి 1,500 రూ పాయలు అద్దె తీసుకుంటున్నారు.

పంట దిగుబడి..

పంటల దిగుబడుల కోసం నల్లరేగడి మట్టితో పాటు సేంద్రియ ఎరువులపై ఆసక్తి కనబరుస్తున్నారు. అధికంగా అటవీ ప్రాంత గ్రామాలు ఉండడం వల్ల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పశు పోషణ ఎక్కువగా ఉంది. దీంతో చాలా మంది రైతులు సేంద్రీయ ఎరువులను పంట చేనుల్లో వాడుతున్నారు. సేంద్రీయ ఎరువులతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుండడంతో పాటు ఒక సంవత్సరం ఎరువు వేస్తే మూడు సంవత్సరాల వరకు పని చేస్తుం డడంతో రైతులు ఎక్కువగా మేకలు, గొర్రెల ఎఉవుల వాడటంపై ఆసక్తి కనబరుస్తున్నారు. సేంద్రీయ ఎరువు ట్రాక్టర్ రూ.1500 వరకు అలాగే సంవత్సరంలోపు కుప్ప సుమారు రూ.15 వేల వరకు గ్రామాల్లో అందుబాటులో ఉంటుంది.

భూమి సారవంతం..



సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారవంతం అవుతుంది. పంట దిగుబడి సైతం పెరుగు తుంది. సేంద్రియ ఎరువు ఒక్కసారి వేస్తే సుమారు మూడేళ్ల పాటు పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. రైతులను సేంద్రియ ఎరువులు వినియోగంచాలి

- భీము, రైతు, భీమన్‌గొంది

వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్



రమేశ్, ట్రాన్స్‌కో ఏఈ

ఆంధ్రజ్యోతి: వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ అందజేస్తున్నారు?

ఏఈ: వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ రైతాంగానికి అంద జేస్తున్నాం. ఎక్కడా సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోతే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పంట చేనులో విద్యుత్ కనెక్షన్ ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ఏఈ: పంట చేను యజమాని పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించి స్తంభాలు అంచనా వేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు వంగి పోయాయి. వాటిని సరి చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఏఈ: గ్రామాల్లో వంగి ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించాం. వాటి స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బంది తరుచూ తనిఖీ చేస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారా?

ఏఈ: వేసవిలో విద్యుత్ వాడకం అధికంగా ఉంది. పాత ట్రాన్స్‌ఫార్మర్‌లకు లోడ్ ఎక్కువ కావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 18 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ఎక్కడైనా సమస్య ఉంటే గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి

వేసవి పంట..
ఆదాయం ఇంట

పాల, మొర్రి, తునికి, ఇప్పపువ్వుల సేకరణ
గిరిజనులకు నెలన్నర పాటు
ఆర్థిక భరోసా

ఆసిఫాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు వేసవి పంటగా భావించే పాల, మొర్రి, తునికి, ఇప్ప పువ్వు సేకరిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో పలు రకాల పండ్లు లభిస్తాయి.. సమీప గ్రామాల్లోని గిరిజనులు తెల్లవారు జామునే అడవికి వెళ్లి సేకరించి గ్రామాల్లో విక్రయిస్తారు. పాల, మొర్రి, తునికి, ఇప్ప పువ్వులతో పాటు తునికాకు, చీపురు పుల్లలను సేకరిస్తారు. మండు వేసవిలో సహజ సిద్ధంగా లభించే అడవి పండ్లు అందరికి ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. అడవులకు నిలయమైన కుమరం భీం జిల్లాలోని ఆయా మండలాల్లో అటవీ ప్రాంతాల్లో పలు రకాల పండ్లు లభిస్తాయి. ప్రకృతి పరంగా లభ్యమయే ఇలాంటి పండ్లు పట్టణ ప్రాంతాల్లో చాలా మందికి తెలియదు. అడవులు దగ్గరగా ఉన్న గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో మాత్రం నెల రోజుల పాటు వీటి విక్రయాలు జోరుగా సాగుతాయి. వీటిలో ఉండే పోషక విలువల గురించి తెలిసిన పల్లె జనం వీటిని కొనుగోలు చేస్తుంటారు. మనం తినే అన్ని ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. దీంతో ఇటీవల చాలా మంది క్రిమి సంహారక రసాయనాలు వాడని ఆహార పదార్థాలను తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.



ఆసిఫాబాద్‌లో తునికి పండ్లు విక్రయిస్తున్న గిరిజనులు

ఆయా మండలాల్లో..

జిల్లాలోని వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్, తిర్యాణి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, బెజ్జూరు, సిర్పూర్(టి), చింతల మానెపల్లి, పెంచికలపేట మండలాల్లో విస్తరించి ఉన్న అడవుల్లో వేసవి కాలంలో అటవీ పండ్లతో పాటు తునికాకు, చీపురు లాంటి అటవీ ఉత్పత్తులను గిరిజనులు సేకరించి ఆదాయం పొందుతున్నారు. అటవీ ప్రాంతంలో పాల పండ్లు, మొర్రిపండ్లు, విత్త నం మొర్రి పలుకులు(సార పప్పు), తునికి పండ్లు, ఇప్పపువ్వు విరివిగా లభ్యమవుతుంటాయి. అటవీ ప్రాంతంలో లభించే పలు రకాల పండ్లు, అటవీ ఉత్పత్తులు గిరిజనులుకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. అటవీ ప్రాంతంలో సేకరించిన వీటిని సాయంత్రం వేళల్లో సమీప గ్రామాల్లో, మండల కేంద్రాల్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. వేసవికాలంలో సుమారు 45 రోజుల పాటు లభించే ఈ అటవీ ఉత్పత్తులను గిరిజనులు సేకరించి రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదించుకుంటున్నారు.

కాలక్రమేణ..

కాలక్రమేణ అడవులు అంతరించి పోతుండడంతో వివిధ రకాల పండ్లు కూడా దొరకడం లేదు. దీంతో అనేక వ్యయ ప్రయాసాలకు కోర్చి సేకరించిన పలు రకాల పండ్లను చిన్న గ్లాస్‌కు 20నుంచి 30 రూపాయలకు విక్రయిస్తున్నారు. పెద్ద గ్లాస్ పండ్లు 50 రూపాయలకు విక్రయిస్తున్నారు. సీజన్ వారీగా సహజ సిద్ధంగా లభించే ఈ పండ్లతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రజలు కొనుగోల్లకు ఆసక్తి చూపుతున్నారు.

తెల్లవారుజామునే అడవికి..

గిరిజనులు తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల ప్రాంతంలో గ్రామాల సమీపంలో అడవికి వెళ్లి వివిధ రకాల పండ్లు సేకరించే క్రమంలో ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. పండ్లను సేకరిస్తున్న క్రమంలో ఒక్కో సారి అడవి పందులు, ఎలుగుబంట్లు, పాముల నుంచి ప్రమాదాలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో పలువురు గాయపడిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. పండ్లను తెంపే సమయంలో చెట్లపై నుంచి పడి పోయిగాయాల పాలవుతుంటారు.



మొర్రి పండ్లు



కెరమెరిలో ఇప్ప పువ్వు సేకరిస్తున్న గిరిజనులు

అన్నదాతకు నకిలీ పత్తి విత్తనాల బెడద

▸ అధికారులు తనిఖీలు చేస్తున్నా అడ్డుకట్ట పడని వైనం

చింతలమానేపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా అక్రమార్కులు కొత్తదారులు వెతుక్కుంటున్నారు. విత్తనాలు విత్తుకునే సమయానికి ముందే వేసవి కాలంలోనే ఈ దందా సాగిస్తున్నారు. విత్తనాలు విత్తుకునే సమయంలో తనిఖీలు ఎక్కువగా ఉంటాయనుకుంటున్న వ్యాపారులు ఏటా వేసవిలోనే దందా మొదలు పెట్టి రైతులకు అంటగట్టేస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేక నిఘాను ఏర్పాటును పెంచాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బీటీ -3 పేరిట సాగతున్న ఈ నకిలీ- మకిలీలో స్థానిక వ్యాపార లతో పాటు కొంత మంది బడా బాబులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ విత్తనాలను గ్రామాల్లో రైతులకు ప్రతీ ఏటా ఏజెంట్ల ద్వారా అంటగడుతున్నారు. గత నాలుగైదేళ్ల నుండి చాలా మంది రైతులు బ్లాక్ మార్కెట్లో ఈ విత్తనాలతో పాటు ఆ కంపెనీకే చెందిన గడ్డి మందును కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారు. వేలాది ఎకరాల్లో ఈ మందు పిచికారి చేయడంతో పత్తి మొక్కలు చనిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టం చవి చూస్తున్నారు.

● ఇటీవల దాడుల్లో..

● ఏప్రిల్ 2న చింతలమానేపల్లి మండలంలో నకిలీ విత్తనాలు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేయగా ఆసిఫాబాద్ మండలం బూరుగూడకు చెందిన ఓ వ్యక్తి వద్ద 300 కిలోల పత్తి విత్తనాలను పట్టుకున్నారు. వీటి విలువ రూ.10.50లక్షలు

● ఏప్రిల్ 4న బెజ్జూర్ మండలానికి చెందిన వ్యక్తికి చెందిన 1.57 లక్షల విలువైన 45 కిలోల నకిలీ విత్తనాలను పట్టుకున్నారు.

● కాగజ్‌నగర్ మండలంలో ఏప్రిల్ 18న ఓ వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా 100 కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ. 3.5 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

● మే 7న పెంచికలపేట మండలంలో 400 నకిలీ పత్తి విత్తనాలను ఓ ముఠా సభ్యులు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తుండగా మాటు వేసి పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ 12 లక్షలు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 800 కిలోల పైనే నకిలీ విత్తనాలు పట్టుకోగా 25 లక్షలపైగా వీటి విలువ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏటా భారీగా ..

నకిలీ నిత్తనాలతో పట్టుబడిన అక్రమ వ్యాపారులను అధికారులు విచారిస్తున్నప్పుడు గ్రామాల్లోని దళారులు, వ్యాపారుల ద్వారా రైతులకు నేరుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందా భారీ ఎత్తున సాగుతున్నట్లు వెల్లడవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ విస్తీర్ణంలో పత్తి పంటను సాగుచేస్తున్నారు. జిల్లాలోని మా రుమూల మండలాలైన చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, సిర్పూర్(టీ) మండలాల్లోనే దాదాపు అన్ని గ్రామాల్లో విత్తనాలను రైతులకు అంటగడుతూ రైతాంగాన్ని తీవ్ర నష్ట పరుస్తున్నారన్న ఆరో పణలున్నాయి. కిలో నకిలీ విత్తనాలు రూ. 3,000 నుంచి 3,500 వరకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు.



చింతలమానేపల్లి మండలంలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

రైతులకు నష్టాలు..

నకిలీ విత్తనాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు ఉండవు, అధిక దిగుబడులు, తక్కువ ఖర్చు అని రైతులకు మాయ మాటలు చెప్పి గ్లైసిల్ బీటీ-3 (గడ్డి విత్తనాలు) పేరిట వ్యాపారులు, దళారులు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు. రైతులు సైతం ఈ విత్తనాల పట్లనే ఆసక్తి కనబరుస్తున్నారు. కేవలం విత్తనాలు నాటుకొని, కలుపు నివారణ కోసం మందు పిచికారి చేస్తే సరిపోతుందని అనుకోవడంతో రైతుల అమాయకమే దళారులకు లాభాన్ని చేకూరుస్తుంది. కానీ గ్లైసిల్ విత్తనాలను రైతులు తమ తమ చేనల్లో వరుసగా 7 సంవత్సరాలు సాగు చేస్తే మరుసటి సంవత్సరం నుంచి కనీసం మొలక కూడా మొలవక పోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రైతులకు దళారుల వద్ద కొన్న నకిలీ విత్తనాలకు ఎ లాంటి రశీదులు ఇవ్వరు కాబట్టి పంట నష్ట పోతే రైతులకు సాయం అందదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

నకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దు. అప్రమత్తంగా ఉండాలి. ప్రభు త్వం నుంచి అనుమతి పొందిన ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మాత్రమే విత్తనాలను, మందులను కొనుగోలు చేయాలి. నకిలీ విత్తనాలు విక్రయించకుడా పోలీసు అధికారుల సాయంతో తనిఖీలు చేపడతాం. నకిలీ విత్తనాలతో పట్టుబడ్డ వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు తెలుస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- కార్తేషా, ఏవో, చింతలమానేపల్లి

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కాసిపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ట్యాంక్ బస్తీకి చెందిన గోపే సందీప్ (40) కుటుంబ కలహాలతో ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సందీప్ కేకే ఓసీపీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతడికి 12ఏళ్ల క్రితం కొండాపూర్ యాపకు చెందిన గోపతి రాజేశ్వరితో వివాహం అయింది. వీరిద్దరికి కూతురు జన్మించింది. ఇద్దరి మధ్య మనస్పర్ధల వల్ల పదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఆదివారం ఉదయం సందీప్ కూతురును చూడాలని పిస్తుందని భార్య రాజేశ్వరికి ఫోన్ చేశాడు. కానీ ఆమె దానికి నిరాకరించంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో మద్యం మత్తులోని ట్యాంక్ బస్తీ శివారు ప్రాంతంలో యాప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తండ్రి రాజయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకొని కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఆసిఫాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగర్ కాలనీలో ఆదివారం ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్ కాలనీకి చెందిన యువతి(17)ని తల్లిదండ్రులు కొంత కాలంగా వ్యవసాయ పనులకు తీసుకు వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నా ఆమె నిరాకరిస్తోంది. తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారని మనస్తాం చెంది ఆదివారం పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాల తీసుకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందింది. తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో యువకుడి మృతి

పెంచికలపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా పెంచికలపేట మండలంలోని కొండపల్లిలో శనివారం రాత్రి ఓ యువకుడు వడదెబ్బతో మృతి చెందాడు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ఎందిన మానెపల్లి సత్తయ్య, బుజ్జి దంపతుల కుమారుడు మానేపల్లి గొంతయ్య(19) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చాడు. అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నాడు. కుటుం బ సభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. రాత్రి 10 గంటల సమయంలో గొంతయ్యను కుటుంబ సభ్యులు నిద్ర లేపేందుకు యత్నించగా మృతి చెంది ఉన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు.



గొంతయ్య(ఫైల్)

నేడు జిల్లాకు మంత్రి సీతక్క రాక

ఆసిఫాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా నేడు ఆసిఫాబాద్ జిల్లాకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం మూడు గంటలకు రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామం వద్ద సీసీ రోడ్ల పనులు శంకుస్థాపన చేసి అక్కడి నుంచి చింతలమానేపల్లి డబ్బా గ్రామంలో కుమరం భీం విగ్రహం ప్రారంభించనున్నారని తెలిపారు. కాగజ్‌నగర్‌లోని పీఎం ఉషలో భాగంగా నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన చేయడంతో పాటు సమగ్ర శిక్ష కింద కాగజ్‌నగర్ కేజీబీవీ జూనియర్ కళాశాలగా ఉన్నతీకరిస్తూ ప్రారంభోత్సవం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా జన్నారంలో బస చేసి మంగళవారం అక్కడ ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

కాగజ్‌నగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆదివారం పట్టణంలో సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మే 20న నిర్వహించే ఈ సార్వత్రిక సమ్మెను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రదాన మంత్రి మోదీ అధికారలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్‌లకు రూ. 16లక్షల 35 వేల కోట్లు మాఫీ చేశారని చెప్పారు. కానీ కనీస వేతనం, ఇతర పేద ప్రజలకు ప్రయోజనం చేకూరే సమస్యలను మాత్ర పరిష్కరించడం లేదన్నారు. 12 పని గంటలుగా మార్చి కార్మికుల శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20న నిర్వహించే సమ్మెలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, త్రివేణి, శంకర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



కేంద్రం విధానాలు సరికాదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు

మందమర్రిటౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక, పారిశ్రామిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కేంద్రం విధానాలకు నిరసనగా ఈ నెల 20న తలపెట్టిన ఒక్కరోజు సమ్మె ను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బరలీ, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి పౌలు, సమ్మయ్య, కలీందర్ అలీఖాన్, సరస్వతి, మల్లేష్, సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, బాపు, పోశం పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణపై
అవగాహన కరువు

▸ నిలిచిపోతున్న పెన్షన్లు
▸ ఇబ్బంది పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): లైఫ్ సర్టిఫికెట్ల సమర్ప ణపై సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు అవగాహన కరువైంది. ఈ విషయంలో తెలియజెప్పాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పెన్షన్లు నిలిచిపోతున్నాయి. విశ్రాంత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏటా సమర్పించాల్సిందే..

రిటైర్డ్ ఉద్యోగులు ప్రతి సంవత్సరం లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలి. ఆ తరువాతే వారికి పెన్షన్ అందుతుంది. కానీ గతంలో పనిచేసిన వారంతా దాదాపు నిరక్షరాస్యులు కావడం, రిటైర్ అయిన తరువాత చాలా మంది అనారోగ్యం బారినపడడం, కుటుంబ సభ్యులు సైతం వారి పనుల్లో పడి గుర్తుంచుకోలేకపోవడం, తదితర సమస్యలతో ఇవ్వలేకపోతున్నారు. కొన్నిసార్లు సమర్పించినా, మరికొన్ని సార్లు ఆన్‌లైన్ చేయడం లేదు. ఫలితంగా పెన్షన్లు నిలిచిపోతున్నాయి. ఇలాంటి వారు సింగరేణిలో 1818 మంది వరకు ఉన్నట్లు అంచనా. వారికి పెన్షన్లు నిలిచిపో వడంతో కుటుంబ ఖర్చులకు, మందుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు డబ్బు అందుబాటులో ఉండడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి..



సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పొందేందుకు ప్రతి యేటా లైఫ్ సర్టిఫికెట్లు పొందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. కానీ తగిన సమాచారం లేక సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనివల్ల కొత్తగూడెం సీఎంపీఎఫ్ కార్యాలయం పరిధిలో 1818 మందికి పెన్షన్లు ఆగిపోయాయి. ఈ విషయంలో సంక్షేమాధికారులు కల్పించుకొని సహకారం అందించాలి. లేదంటే విశ్రాంత కార్మికులు ఇబ్బదులకు గురవుతారు. సర్టిఫికెట్లు ఇచ్చిన తరువాత త్వరగా వాటిని సీఎంపీఎఫ్ కార్యాలయాలకు చేరవేయాలి.

- వేణుమాధవ్, ఉప ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

రీజినల్ కార్యాలయం పరిధిలో..

కొత్తగూడెం సీఎంపీఎఫ్ రీజినల్ కార్యాలయం పరిధిలో 18111 మంది పెన్షన్‌దారులున్నట్లు ఆ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి నెల వీరంతా 20 కోట్ల 6 లక్షల 15 వేల 726 రూపాయలు పెన్షన్ రూపేణా పొందుతున్నట్లు తెలిపారు. వీరిలో 2134 మంది పెన్షనర్లు కనీస పెన్షన్ రూ.1000లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం గతంలో రూ.350 వరకు మాత్రమే తీసుకునేవారు. కానీ 08-03-2024 నుంచి రూ.1000 చెల్లిస్తున్నట్లు వివరించారు.

అవగాహన కల్పించేవారేరి ?

సింగరేణి ఉద్యోగులు వారు పనిచేసిన గని, విభాగం ద్వారా లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణపై సమాచారం అందుకోవాలి. కానీ సంక్షేమాధికారులు వారికి సమాచారం ఇచ్చే ప్రయత్నం చేయడం లేదు. గనులు, విభాగాలపై నోటీసులు అంటించి చేతులు దులుపుకుంటున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో రిటైర్డ్ కార్మికులకు సైతం మొబైల్ ఫోన్లు ఉన్నాయి. వాటికి మెస్సేజ్ పంపడం గానీ, ఫోన్ చేయడం గానీ చేయడం లేదని విశ్రాంత కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు పెన్షన్ ఆగిపోయిన తరువాత సంక్షేమాధి కారులను కలిస్తే నోటీసు అంటించామని సమాధానం చెప్తున్నారని ఆరోపిస్తున్నారు. మళ్లీ సర్టిఫికెట్ ఇచ్చిన తరువాత సీఎంపీఎఫ్ కార్యాలయాలకు చేరవేసేందుకు సైతం ఆలస్యం చేయడంతో పింఛన్ తిరిగి ప్రారంభం కావడానికి సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందిస్తూ రిచన్లు నిలిచిపోకుండా సహకరించాలని వారు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దహెగాం, మే 11(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఖర్జి గ్రామానికి చెందిన జునగరి సత్తయ్యకు చెందిన ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఆదివారం ఉదయం ఎద్దును మేతకు వదిలి పెట్టగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.50 వేల విలువ చేసే వ్యవసాయం చేసుకునే ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

వాంకిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు గుర్తించి బాధితులకు ఆదివారం అందజేశారు. వాంకిడి మండలం కోమటిగూడకు చెందిన వినేష్, బంబార గ్రామానికి చెందిన బిక్కులు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయగా బాధితులకు ఆదివారం ఎస్సై ప్రశాంత్ ఫోన్లను అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో పిర్యాదు నమోదు చేస్తే గుర్తించి అందజేస్తామని తెలిపారు.

వీర జవాన్లకు నివాళులు

బెల్లంపల్లి, మే11 (ఆంధ్రజ్యోతి): భారత్ పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమరులైన జవాన్లకు ఆదివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌కు భారత్ గట్టి పోటీ ఇస్తుందన్నారు. భారత సైనికులు ప్రాణాలు తెగించి సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఉగ్రవాదుల నిర్మూలన కోసం ఆపరేషన్ సింధూర్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు పోతరాజు, రాజేందర్, శ్రీనివాస్, రాజుకుమార్, వెంకటి పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

బెల్లంపల్లి, మే11(ఆంధ్రజ్యోతి):ఈ నెల 13న పాలీసెట్ 2025 పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా కోఆర్డినేటర్ ఎం. దేవేందర్ తెలిపారు. మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలిసెట్ బెల్లంపల్లి పట్టణం నుంచి 1081 మంది విద్యార్థులు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1032, మంచిర్యాల పట్టణం నుంచి 2558 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. మే 13న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్షలు ఉంటాయని విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 10గంటలకే హాజరుకావాలని సూచించారు.

అలాగే హాల్‌టిక్కెట్‌పై ఉన్న సూచనను విద్యార్థులు ముందుగానే చదివి పరీక్ష కేంద్రానికి ఒక నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడదని తెలిపారు.

సేవే పరమావధిగా..



వైద్య పరీక్షలు చేస్తున్న నర్సు

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ఆరోగ్య సంరక్షణలో వ్యవస్థలకు నర్సుల పాత్ర గుండెకాయ లాంటిది. చికిత్స ప్రక్రియ అవసరమైనా సంరక్షణ, సౌకర్యం, మద్దతు అందించి మనోస్థైర్యాన్ని నింపుతారు. రోజువారి కార్యకలాపాలకు సహాయం చేయడంతో పాటు సమయానికి మందులు అందించి రోగి బాబోగులు చూస్తారు. మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా...



నస్పూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సేవకు ప్రతిరూపంగా... వైద్యుడికి సహాయకులుగా... రోగులకు స్వస్థత చేకూర్చడంలో నర్సులు కీలక భూమికను పోషిస్తున్నా రు. శతాబ్దం కిందట రూపుదిద్దుకున్న నర్సింగ్ వ్యవస్థ నేటికి సేవే పరమావధిగా సాగుతోంది. వైద్యుడు అందించే చికిత్సకు ముందు రోగి పరిస్థితి అంచనా వేయడం, ప్రాథమిక చికిత్స అందించడంలో వీరే కీలకం. అంతే కాకుండా రోగుల శస్త్ర చికిత్సల్లో ప్రధాన భూమికను పోషిస్తారు. తదనంతరం సేవల్లో నర్సులే ప్రధానం. వైద్య పరంగా సేవలందించడంతో పాటు మనో, ధైర్యం కల్పించడంలోనూ ముందుండి ఉద్యోగ ధర్మాన్ని పోషించడంలో వారికి వారే సాటి. ఆరోగ్య సంరక్షణలో నర్సులు పోషించే అచంచలమైన అంకిత భావం, కీలక పాత్ర ఎంతో గౌరవమైనది.

నేపథ్యం..

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం మే 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా జరుగుతోంది. వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందిస్తున్న సేవ, తోడ్పాటును జప్తికి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820 మే 12న ఇటలీలో జన్మించింది. చదువు పూర్తి చేసుకున్న అనంతరం 1853లో లండన్‌లోని మహిళ ఆసుపత్రిలో సూపరిండెంట్‌గా చేరారు. 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు తన నర్సుల బృందంతో వెళ్లి వైద్య సేవలందించారు. ప్రపంచంలోనే తొలి సారిగా నర్సులకు శిక్షణ కాలేజ్‌ని స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ సంస్థ 1965 నుంచి నైటింగేల్ పుట్టిన రోజైనా మే 12న నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఆమె పుట్టిన రోజునా నర్సుల దినోత్సవంగా జరుపుకుంటోంది.



వరంగా భావిస్తాం: ఎం. కవిత, నర్సింగ్ ఆఫీసర్- నస్పూర్



నిత్యం అనేక మంది వివిధ వ్యాధులతో అసుపత్రికి వస్తుంటారు. వారికి సేవలందించడం వరంగా భావి స్తాం. మహిళలు వారి సమస్యలతో బాధ పడుతూ వ స్తారు. వారి సమస్యను విని మనోధైర్యం కల్పిస్తాం, భ యపడవద్దని, ధైర్యంగా ఉండమని చెబుతాం. అవస రమైన వారికి శస్త్ర చికిత్సల్లో సహాయం అందిస్తాం. న మయానికి మందులు, ఆహారం తీసుకోవాలని సూచనలు ఇస్తాం.

ఓర్పు అవసరం.. : ఎస్. నవిత, నర్స్- నస్పూర్



రోగుల పట్ల ఓపిక, సహనం చాలా అవసరం. ప్రతి రోజు వచ్చే రోగులకు వైద్యులు రాక ముందే అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. శస్త్ర చికిత్సలకు అవసరమైన ఏర్పాట్లను చేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికి వ్యాధుల పట్ల అవగాహన, జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తాం.

రేషన్ బియ్యం రాలే..

(5వ పేజీ తరువాయి)

అధిక సమయం పడుతున్నట్లు సమాచారం. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితులు నెలకొనగా, షాపుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి లబ్ధిదారులకు పట్టింది.

గడువు పెంచుతారా...?

రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ఈ నెల 15తో గడువు ముగియనుండగా అధికారులు స్పందించి గడువు పెంచాల్సిన అవసరం ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వ లేక, డీలర్లకు స్టాకు చేరడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సరిపడా స్టాక్ వచ్చి పంపిణీ పూర్తయ్యే వరకు గడువు పెంచాలనే డిమాండ్లు సర్వత్రా వినిపి స్తున్నాయి.

బియ్యం ఇవ్వడం లేదు..వాణి, ఎల్ఐసీ కాలనీ



రెండు మూడు నెలలుగా రేషన్ షాపుల్లో సరిగ్గా బియ్యం ఇవ్వడం లేదు. ప్రతినెల 1 నుంచి 15వ తేదీలోపు ఇవ్వాల్సి ఉంది. 12వ తేదీ వచ్చిన బియ్యం ఇయ్యకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బియ్యం ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రతిరోజూ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

కొనుక్కున్నాక ఇస్తే ఏం లాభం..

శంకరమ్మ, సంజీవయ్య కాలనీ



బియ్యం పంపిణీ ప్రతినెలా ఆలస్యంగానే ఇస్తున్నారు. అడిగితే స్టాకు రాలేదంటున్నారు. ప్రతిసారీ ఇదే తంతు. సకాలంలో బియ్యం అందితే ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తుందని సంతోషపడ్డా, అవి సమయానికి అందడం లేదు. మార్కెట్లో కొనుక్కున్నాక ఇస్తే ఏం లాభం. ప్రతి నెలా త్వరగా ఇచ్చేలా చూడాలి

ఎప్‌సెట్‌లో ప్రతిభ

దండేపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన అభిశేక్ ఆదివారం వెలువడిన ఎప్‌సెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. అభిషేక్ తండ్రి కుమారస్వామి, ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. తల్లి గృహిణి. చిన్న తనం నుంచి అభిశేక్ చదువుల్లో రాణించడంతో ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చేర్పించారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో 2245 ర్యాంక్ సాధించి శభాష్ అనిపించుకున్నాడు, ప్రతిభ కనబర్చిన అభిషేక్‌ను పలువురు అభినందించారు.

భూమిలేని నిరుపేదలకు భూపంపిణీ చేయాలి



భీమిని ర్యాలీలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

భీమిని, మే 11 (ఆంధ్రజ్యోతి) : భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూపంపిణీ చేయాలని అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైరవీలకు తావులేకుండా అర్హులకు మంజూరు చేయలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖర్జిభీంపూర్, భీమిని గ్రామాల్లో పల్లెలే మా పాఠశాలలు ప్రజలే మా గురువులు గ్రామాలకు తరలండి అనే కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు గ్రామంలో కాలనీల్లో తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి చరణ్, శ్రీకాంత్, గణేష్, దీపాలక్ష్మీ, రత్నం తిరుపతి, నాయకులు మనోహర్, చంద్ర మేర, రామయ్య, సత్తన్న, రాజేష్, తుకారం పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ నాయకులు

మందమర్రిటౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా బీసీలందరు ఏకతాటిపై ముందుకు సాగాలని బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెబాట కార్యక్రమం ఆదివారం మందమర్రికి చేరుకుంది. ఈసందర్భంగా పట్టణంలోని మార్కెట్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బీసీలకు అభివృద్ధి ఫలాలు అందడం లేదన్నారు. బీసీలను ఐక్యం చేయడం కోసం బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్ర మాన్ని చేపట్టామన్నారు. కుల గణన చేపట్టాలని, బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తమ జాతీయ నాయకుడు సంజయ్‌కుమార్ ఢిల్లీలో ఆమరణ దీక్ష చేపట్టనున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి మనోహర్, సకినాల శంకర్, శ్రీనివాస్, వెంకటేస్, శేఖర్, కుమార్, భాస్కర్, శ్రీనివాస్, వంశీనేత, అర్జున్ పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనులు రాజకీయాల్లో రాణించాలి

- కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ గిరిజన శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్
- గిరిజనులకు మూడు రోజులు శిక్షణ తరగతులు

జన్నారం, మే11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆదివాసీ గిరిజనులు రాజకీయంగా మెరుగు పడాలని రాజ్యపాలనతో ముందుండాలని కాంగ్రెస్‌పార్టీ జాతీయ ఆదివాసీ గిరిజన శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో రిసార్ట్‌లో తెలంగాణ ఆదివాజీ గిరిజనులకు మూడు రోజుల శిక్షణ తరగతులో భాగంగా మొదటి రోజు అట్టహాసంగా ప్రారంభించారు. మొదటగా యుద్ధభూమిలో అమరులైన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ సూచనల మేరకు దేశంలో ఆదివాసి గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారి అభ్యున్నతికి వారు రాజ్య పాలనలో ముందుండాలన్నారు. గతంలో నిర్వహించిన మేదోమదన సమావేశంలో రాహుల్ గాంధీ సూచనల మే రకు కమిటీ ఏర్పాటు చేశారని, అందులో భాగంగా ఛత్తీస్‌గడ్, మధ్య ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులకు మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఇందులో రాజకీయంగా సమన్వయం గ్రామాల అభివృద్ధి పార్టీ బలోపేతం, సామాన్యులకు అందే విద్య, వైద్యం, సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లి గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వాలకు తెలియ జెప్పి ప్రజా పక్షాన పోరాడే విధంగా ప్రతి నాయకుడు ఎదగాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచి మగ్గురు చొప్పున ఎంపిక చేసి ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశామని ఈ మూడు రోజుల్లో ప్రతి ఒక్కరిని నాయకులుగా తీర్చిదిద్ది ప్రజా పాలనలో నాయకులుగా ఉండే విధంగా ప్రతి నాయకుడికి క్రమశిక్షణ, అంకితభావం, సేవా బావం ఉండాలని అప్పుడే ఉన్నత నాయకుడిగా ముందుకు వస్తారని అన్నారు. అనంతరం ఖానా పూర్ ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ గిరిజనులు అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నారని వారి సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ నాయకులుగా మాత్రం కొద్ది మంది మాత్రమే ఉన్నారని రాజ్యపాలనకు దీటైన నాయకులుగా ఎదగాలని అందులో మహిళలు, విద్యార్థులు మేధావులుగా ముందుకు రావాలన్నారు.

నియోజకవర్గ స్థాయి నుంచి ముగ్గురికి శిక్షణను ఇప్పించి రెండవ దశలో నియోజకవర్గ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామానికి ఒకరిని ఎంపిక చేసి శిక్షణను ఇస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో జాతీయ ఆదివాసీ గిరిజన చైర్మన్ బెల్యా నాయక్, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్, పార్లమెంట్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, రాజుతో పాటు మండల నాయకులు ముజాఫర్ అలీ, సయ్యద్ ఫసియుల్లా, లక్ష్మీనారాయణతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ ట్రైనింగ్ కన్వీనర్ రాహుల్‌బల్

పేదోడికే ఇందిరమ్మ ఇల్లు..

- నిబంధనలు కఠినతరం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.
- ఫోర్ వీలర్ ఉంటే అనర్హులు ● 600 చదరపు గజాలు మించితే బిల్లు రాదు

దండేపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇళ్లను దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. పక్కాగా పేదలకు ఇల్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుం డగా, నిబంధనలు కఠినతరంగా ఉండటంతో అనేక మందికి ఇల్లు దక్కే అవకాశం లేదు. ఈ పథకం అమలులో భాగంగా సొంత స్థలం కలిగిన వారికి ఇల్లు నిర్మించుకునేందుకు దశల వారిగా రూ. 5లక్షల ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందు కోసం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. పక్కాగా పేదలకు ఇల్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుండగా, నిబంధనలు కఠినతరంగా ఉండడంతో అనేక మందికి ఇల్లు దక్కే అవకాశం లేదు. కారు, ఏసీ, ట్రాక్టర్‌తో పాటు చాలా నిబంధనలు రూపొందించగా, వడపోతలో లబ్దిదారులు ఇళ్లకు అర్హత కోల్పోతున్నారు. లబ్దిదారుల ఎంపిక ఇటు అధికారులకు అటు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు తలనొప్పిగా మారింది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ అనేక సార్లుగా సర్వే చేస్తూ లబ్దిదారుల ఎంపికను వడపోస్తున్నారు, దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిజమైన పేదోడికే ఇల్లు మంజారు చేసే విధంగా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికకు ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు కింద విధంగా ఉన్నాయి.

ప్రభుత్వం కఠినతరం చేసిన నిబంధనలు ఇవే..

- ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారులు బీపీఎల్(దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబానికి చెందిన ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్దిదారుడి ఆదాయం నెలకు 10 వేల రూపాయలు, పట్టటణ ప్రాంతాలకు 15 వేలలోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు అనర్హులు.
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో కేసీసీ(క్రాప్ లోన్) 50 వేల రూపాయలకు మించి ఉండరాదు.
- వ్యాపారం, అదనపు ఆదాయ పన్ను, ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే లబ్ధిదారులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హులు.
- ప్రస్తుతం రేకుల షెడ్డు, గుడిసె, గూనెపెంకల ఇంట్లో నివాసం ఉన్న లబ్ధిదారుడు అర్హుడు.



- తండ్రి, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటే ఒక్కరికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారు.
- మున్సిపల్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉండే లబ్ధిదారులు అర్హులే.
- లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.
- ఇంటి స్థలానికి సంబంధించి పట్టా, ఓనర్ షిప్ సర్టిఫికెట్ లేకుంటే ఇల్లు మంజూరు చేయరాదు.
- కొత్త ఇంటి నిర్మాణం 400 నుంచి 600 అడుగులలోపు ఉండాలి. అధికంగా ఉంటే అనుమతి ఇవ్వరాదు.
- ఇండ్ల నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డితో నిర్మించాలి.
- ఇంటి నిర్మాణం ఇంతకు ముందే ప్రారంభించిన, పాత ఇంటిని కలుపుకొని నిర్మించిన కొత్త ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.
- లబ్ధిదారుడికి 4 విడతలుగా ఇంటి బిల్లులు చెల్లిస్తారు. మొదటి బేస్‌మెంట్ నిర్మాణం చేపడితే రూ. లక్ష, పిల్లర్లు వేసి గోడలు కడితే రూ 1.25లక్షలు, స్లాబ్ వేసిన తర్వాత రూ 1.75లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత చివరగా రూ లక్ష అందిస్తారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

బెల్లంపల్లి, మే11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీ చెల్లించాలని ప్రిన్సిపల్ కాంపెల్లి శంకర్ తెలిపారు. అంబేద్కర్ యూనివర్సిటి డిగ్రీ మొదటి సంవత్సరం ఫీజు చెల్లించని వారు పరీక్షలు రాయని వారు సైతం రెండో సెమి స్టర్‌కు సంబంధించిన ఫీజు చెల్లించాల న్నారు. విద్యార్థులు ఫీజును ఆన్‌లైన్ సెంటర్, మీసేవా ద్వారా చెల్లించాలని సూచించారు.

గడ్డివాము దగ్ధం

భీమారం, మే 11 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని పద్మ శాలివాడలో శనివారం రాత్రి రామల రాజమౌళికి చెందిన ఐదు ట్రాక్టర్ల గడ్డివాము ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. దీంతో కాలనీ వాసులు గమనించి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చిమంటలను ఆర్పి వేశారు. సుమారు రూ. 50 వేల విలువ గల వరిగడ్డి దగ్ధమైందని రాజమౌళి ఆవేదన వ్యక్తం చేశాడు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఆర్‌డీవో



రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీవో

చెన్నూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట, ఎల్లక్కపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం మంచిర్యాల డీఆర్ డీవో కిషన్ పరిశీలించారు. కేంద్రాల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. త్వరగా ధాన్యం తరలించాలని ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలను కల్పించాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట సీసీ రవికుమార్, ఆపరేటర్ అశోక్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ విడుదల

కాసిపేట, మే11(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలం చాకపల్లి సోమవారం బెల్లంపల్లి మండలం చాకపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు కాసిపేట అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దాగాం మల్లేశ్ అన్నారు. ఆదివారం సోమగూడెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చాకపల్లిలో ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. విగ్రహావిష్కరణకు రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి పార్ల మెంట్ సభ్యులు గడ్డం వంశీక్రిష్ణ, అంబేద్కర్ విగ్రహదాత ముడిమడుగుల విజయలక్ష్మీ, గిరిజనశాఖ చీఫ్ ఇంజనీర్ ముడి మడుగుల శంకర్ హాజరవుతున్నారు. కావున అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు తరలిరావాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ముడిమడుగుల మహేందర్, జమ్మి మహేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సుమారు 25 ఏళ్ల తర్వాత ఒకటై ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఇదే పాఠశాలలో1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు అంతా ఏకమై చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో తిరుగుతూ చిన్న నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ సంతోషంలో మునిగిపోయారు. అప్పుడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను వేదికపై సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ఆనందం, మమత, రాంప్రసాద్, మౌళి పద్మతోపాటు పాఠశాల చైర్మన్ శంకరయ్య పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



వేదికపై ఒకటైన 1999-2000పూర్వ విద్యార్థులు

జన్నారం: మండల కేంద్రంలోని ద్వారక తిరుపతి విద్యాలయంలో 2007 -08లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరిని ఒకరు ఆ ప్యాయంగా పలుకరించుకుని పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతో షంగా గడిపారు. ఉపాధ్యాయులను సన్మానించి పాద పూజ చేశారు.

హాజీపూర్: హాజీపూర్ మండల కేంద్రంలోని సబపెల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన 2005-06 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వ హించారు. సుమారు 60 మంది పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరు వేసు కొంటూ ఆనందంగా గడిపారు. 20ఏళ్ల క్రితం తాము చదువు నేర్చుకున్న క్లాస్ రూముల్లో కూర్చొని ఉపాధ్యాయులతో తిరిగి పాటాలు చెప్పించుకున్నారు. ఉపాధ్యాయులు మధుసూదన్, అంజన్న, రవీందర్, రామకృష్ణ, నయీం పాషా, ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజీపూర్ జడ్‌పీహెచ్‌ఎస్‌లో 2005-06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న 2007-08 పూర్వ విద్యార్థులు



నేడు బెల్లంపల్లికి మంత్రి సీతక్క రాక

బెల్లంపల్లి, మే11(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని చాకపల్లి (రాళ్లపేట) గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం మధ్యాహ్నం 1గంటలకు రాష్ట్ర పంచాయతరాజ్, గ్రామీణ అభివృద్ధి శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క రానుంది. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరించి అనంతరం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనుంది. అలాగే ఈ కార్యక్రమానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్ హాజరుకానున్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా నరేష్



నరేష్‌కు నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిటౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పట్టణాధ్యక్షుడిగా స్థానిక రెండవ జోన్‌కు చెందిన చప్పిడి నరేష్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ ఆదివారం జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న నరేష్‌ను గుర్తించి నియమించినట్లు వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

రేషన్ బియ్యం రాలే..



మంచిర్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసే చౌక ధరల దుకాణాలు స్టాక్ లేక వెలవెల బోతున్నాయి. ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీలోపు రేషన్ షాపుల్లో బియ్యం పోయాల్సి ఉంది. అయితే 12వ తేదీ వచ్చినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో స్టాక్ జిల్లాకు చేరనే లేదు. దీంతో కొన్ని రేషన్ షాపుల్లో ఇప్పటి వరకు బియ్యం పోసిన దాఖలాలే లేవు. జిల్లాలో మొత్తం ఐదు ఎంఎల్ఎస్(మండల్ లెవెల్ స్టాకిస్ట్ పాయింట్) గోదాముల ద్వారా 423 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉంది.

- పంపిణీ గడువు ముగుస్తున్నా షాపులకు చేరని వైనం
- చౌక ధరల దుకాణాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- ప్రతి నెలా ఇదే తంతుతో ఇబ్బందికర పరిస్థితులు
- స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచే జిల్లాకు చేరని స్టాకు

ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు...

చౌక ధరల దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్లు సరిపడా స్టాక్ లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని లబ్ధిదారుల అవసరాలకు సరిపడా బియ్యం మరుసటి నెలకు సంబంధించి నడుస్తున్న నెలలో 25వ తేదీలోపు అందుబాటులో ఉంచాలి. స్టాక్ వివరాల సరి చూసుకొని డీలర్లు ఒకటవ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. మే నెలకు సంబంధించి మరో మూడు రోజులే గడువు ఉన్నా... ఇప్పటి దాక ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచే జిల్లాకు చేరకపోవడం గమనార్హం. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్లు మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

సగ భాగం కొరత...

జిల్లాలోని 423 షాపులకు లబ్ధిదారుల సంఖ్యను బట్టి సగటున ప్రతి నెల 80 క్వింటాళ్ల మేర బియ్యం అవసరం అవుతాయి. అయితే ఇప్పటి వరకు పలు ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో ఉన్న చౌక ధరల దుకాణాలకు బియ్యం చేరలేదు. మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్ సీసీసీ నస్పూర్‌లో ఉండగా, దాని పరిధిలోని 20 షాపుల వరకు బియ్యం నెలకోటా పంపిణీ జరుగలేదు. ఆయా షాపుల పరిధిలో సుమారు రెండు వేల క్వింటాళ్ల వరకు పెండింగులో ఉంది. స్టాక్ కోసం డీలర్లు పాయింట్ల వద్ద పడిగాపులు కాసినా ఫలితం ఉండడం లేదు. దీంతో లబ్ధిదారులకు జవాబు చెప్పలేక డీలర్లు షాపులను మూసి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్టాక్ వచ్చినప్పుడల్లా తెరిచి అనంతరం మూసి ఉంచక తప్పని పరిస్థితులు నెలకొన్నాయని స్వయంగా డీలర్లే చెబుతుండడం గమనార్హం. మరో వైపు సకాలంలో డీడీలు తీయకనే కోటా విడుదల కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వారు వాపోతున్నారు.

ప్రతి నెలా.. ఏదో సాకు

కొంతకాలంగా రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందడంలేదు. మార్చి నెలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా మరికొన్ని సార్లు అసలు స్టేషన్-1 కాంట్రాక్టర్ వద్దకే పౌర సరఫరాల శాఖ నుంచి పంపిణీ జరుగడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇలా ప్రతి నెల ఏదో తంతు చూపి లబ్ధిదారులను షాపుల చుట్టూ తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ సంవత్సరం స్టేజ్-1 కాంట్రాక్ట్‌ను కరీం నగర్, వరంగల్‌కు అప్పగించారు. అక్కడి నుంచి జిల్లా కు స్టాకు చేరేందుకు కూడా (తరువాయి 7లో)

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

దండేపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రంగంపల్లి గ్రామంలో ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు అదే విధంగా ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను కేంద్రం నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. మిల్లులకు వచ్చిన ధాన్యంను కూలీల సంఖ్య పెంచి వెంటనే దింపుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బూమన్న, కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

ఘనంగా నరసింహుడి జయంతి



నరసింహుడి కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న అర్చకులు

లక్షెట్టిపేట, మే 11(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. వేకువ జాముననే ఆలయంలో పురోహితులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం మూల విరాట్, పంచామృతాభిషేకం, సుదర్శన నారసింహ హోమము, పూర్ణాహుతి పూజలు నిర్వహించిన అనంతరం అభిజిత్ లగ్న సుముహూర్తమున స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం జయంతికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అర్చకులు గొల్లపల్లి శ్రీధరాచారి, గొల్లపల్లి రామానందచారి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి

మంచిర్యాల క్రైం, మే11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి అన్నారు. మంగళవారం నుంచి ఎస్‌జీటీడీఆర్‌పీలు, స్కూల్ అసిస్టెంట్‌లు గణితం, ఆంగ్లం, సాంఘీక శాస్త్రం బీఆర్‌పీలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో చౌదరి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి ఒక ఉపాధ్యాయుడు శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకునేలా రిసోర్స్ పర్సనల్‌లు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన 1811 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1130 సెకండరీ గ్రేడ్ టీచర్లు శిక్షణ పొందుతారన్నారు. ఉపాధ్యాయులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌పీలతో క్వాలీటి కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేశ్, వామన మూర్తి, రామన్న, పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరుకున్న బీసీ మేలుకొలుపు యాత్ర



మంచిర్యాలలో మాట్లాడుతున్న జక్కని సంజయ్‌కుమార్

గర్మిళ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న బీసీ మేలుకొలుపు రథయాత్ర ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలన్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రతిపాదికన అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో బీసీల ప్రాథమిక హక్కు అయిన కుల గణన సాధన కోసం బీసీలు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. బీసీ ఉద్యమాన్ని ప్రతి పల్లెలో బలోపేతం చేసి ప్రతి పల్లెలో బీసీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీసీ మేలుకొలుపు యాత్రను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, లచ్చన్న, నీలకంటేశ్వర్‌గౌడ్, రాజ్‌కిరణ్, శ్రీనివాస్, భాస్కర్, నర్సయ్య, సత్తయ్య, మల్లేష్, రాజన్న, వంశీ, హరీష్‌గౌడ్, భాస్కర్, కుమార్, పోసెట్టి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, మే 11 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం ద్వారా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం భీమారం మండలంలోని భీమారం, దాంపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో బాగంగా భీమారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామసభలను నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ముందుగా పట్టా భూముల సమస్యలను పరిష్కరిస్తామని, అనంతరం లావాణి పట్టా, అసైన్డ్ భూములు,సాదాబైనామాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా కొంత మంది రైతులు తాము తమ తాతల తండ్రుల కాలం నుంచి సాగు చేస్తున్నామని, తమ భూములకు పట్టాలు లేవని, కొందరు మోకా ఉంది కానీ రికార్డుల్లో పేర్లు లేవని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సదానందం, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



భీమారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఘనంగా మదర్స్ డే



మంచిర్యాలలో మాతృమూర్తులను సన్మానిస్తున్న సభ్యులు

గర్మిళ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ మంచిర్యాల, వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలోని వికాస్ తరంగిణి ప్రాంగణంలో మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. 40 మంది మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయ వంతంగా నిర్వహించిన వీర వనితలు సోఫియా ఖురేషి, వ్యామికసింగ్‌ల ధైర్య సాహసాలకు సెల్యూట్ చేశారు. అనంతరం వంద మందికి భోజన సదుపాయాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో లయన్ మధుసూదన్‌రెడ్డి, హన్మంత రావు, వినయ్‌కుమార్, రామాం జనేయులు, చంద్రమౌళి, భాగ్యలక్ష్మీ, ఇందిరదేవి, మంగారెడ్డి, రజనీ, విశ్వేశ్వర్‌రావు సభ్యులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్‌తో యువకుడి మృతి

మందమర్రిటౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన చెరుకు ప్రణయ్‌కుమార్ (22) బ్రెయిన్ డెడ్‌తో ఆదివారం మృతిచెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రణయ్‌కుమార్‌ను కుటుంబీకులు హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్లేట్‌లెట్స్ తగ్గడంతో కోమాలోకి వెళ్లాడు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్‌డెడ్ అయి మృతిచెందాడు. దీంతో మందమర్రిలో అంతులేని విషాదం అలుముకుంది. డిగ్రీ పూర్తి చేసిన ప్రణయ్‌కుమార్ అంత్యక్రియలు ఆదివారం జరగగా తల్లిదండ్రులు స్నేహితులు, కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా రోధించారు. కాలనీలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

చెన్నూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో జయంతి సందర్భంగా ఆదివారం లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు.

విద్యా ప్రమాణాలు పెంచే దిశగా..

13 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

కోటపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో బోధన నాణ్యత పెంచడంతో పాటు సాంకేతికత అందిపుచ్చడం ద్వారా విద్యా ప్రమాణాలను పెంచే దిశగా సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతుండగా మౌలిక వసతులతో పాటు బోధనలో నాణ్యత పెంచేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతుంది. ఎన్‌సీఈఆర్ టీ, విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ అసైన్‌మెంట్ సెంటర్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే 2021 జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఫలితాలు తక్కువగా ఉన్నాయి.

దీంతో ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన ఫలితాలు పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ వేసవి సెలవు ల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తుంది. ఇందుకోసం జిల్లాలో రీసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)లను ఎంపిక చేసిన విద్యాశాఖ ఈ నెల 5 నుంచి 9 వరకు శిక్షణ సైతం ఇచ్చింది. ఇక వీరు ఈ నెల 13 నుంచి స్థానికంగా జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. పీజీ ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్‌జీటీలకు ఈ నెల 13 నుంచి 17 వరకు, 20 నుంచి 24 వరకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా విద్యా శాఖ షెడ్యూలును ఖరారు చేసింది. హెచ్‌ఎంలకు, స్కూల్ అసిస్టెంట్‌లకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇవ్వనుండగా ఎస్‌జీటీలకు మండలాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఐదు రోజులు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది.



సామర్థ్యాలు బలోపేతం చేసేందుకు

సర్కారు బడుల్లోని ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాలు పెంచే దిశగా శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు అవకాశం ఉంది. నాణ్యమైన విద్యను అందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, నాణ్యమైన బోధన పెంపుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ శిక్షణలో వివరించనున్నారు. పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతికతను పెంపొందించేందుకు ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేయగా వీటిని సద్వినియోగం చేసుకోవడం, కృత్రిమ మేధ అందిపుచ్చు కోవడంపై శిక్షణ ఇస్తారు. అంతే కాకుండా ఆసక్తికరమైన బోధనాభ్యాస ప్రక్రియలను రూపొందించడంతో పాటు విద్యార్థుల హాజరు శాతం పెంచడం, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం, పాఠశాల వనరులను సమర్థవంతంగా నిర్వహించడం, వినూత్న వ్యూహాలు, నాణ్యమైన బోధన పద్ధతులపై దృష్టి సారించనున్నారు. తద్వారా విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసన ఫలితాలను పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన డీఆర్‌పీలు ఈ నెల 13 నుంచి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే వివిధ కేంద్రాల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనుండగా జిల్లాలోని 1050 పాఠశాలలకు చెందిన 6531 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. అయితే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో రెండు విడతల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే అన్ని యాజమాన్యాల పాఠశాలలకు దీనిపై సమాచారం ఇచ్చారు.

ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఇచ్చే శిక్షణకు ఏ ఉపాధ్యాయుడు గైర్హాజరు కాకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 5 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ వల్ల నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థులు అభ్యాసన స్థాయి, సామర్థ్యాలు పెరుగుతాయని పలువురు భావిస్తున్నారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందించే దిశగా

యాదయ్య, డీఈవో, మంచిర్యాల



ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలు పెంపొందించే దిశగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలు, అభ్యాసన స్థాయిలు మరింతగా పెంచేందుకే ఈ తరగతులు ఉపాధ్యాయులకు ఉపయోగపడనున్నాయి. విద్యార్థికి ప్రతి సబ్జెక్టుపై పట్టు పెరగడంతో పాటు సాంకేతికంగా అభివృద్ధి చెందుతారు. శిక్షణ తరగతులకు ప్రతి ఉపాధ్యాయులు హాజరు కావాల్సిందే. దీనిపై పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం.